అభివృద్ధి పరుగులు

- రూ.6.64 కోట్లతో 22వ వార్డులో పనులు
- ఇప్పటికే రూ.5.20 కోట్ల పనులు పూర్తి
- కొనసాగుతున్న రూ.80 లక్షల పనులు
- రూ.64 లక్షల పనులకు టెండర్ల ఆహ్వానం


బలరాం నగర్ బీటీ రోడ్డు


విష్ణు హోండా చర్చి కాలువ



బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నగరంలో అభివృద్ధి పనులు విస్తృతంగా చేపట్టింది. జీవీఎంసీ పరిధిలో ప్రతిపక్ష కార్పొరేటర్ ఉన్నా అధిక మొత్తంలో నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించింది. వాస్తవంగా అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ ఉన్న వార్డులకు మాత్రమే అధిక మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తారు. కానీ ఇందుకు విరుద్ధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు మంజూరు చేస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇలా జీవీఎంసీ 22వ వార్డులో జనసేన కార్పొరేటర్ ఉన్నా అభివృద్ధి పనులకు ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఏకంగా రూ.6.64 కోట్ల నిధులు కేటాయించారు. సీసీ రోడ్లు, కాలువలు, పార్కుల ఆధునికీకరణతో వార్డుకు కొత్త లుక్‌ను తీసుకొచ్చారు.

జీవీఎంసీ 22వ వార్డులోని పలు కాలనీలకు సరైన రోడ్లు, కాలువలు లేక చాలా ఏళ్లుగా ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ వార్డులో గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గెలిచారు. అయినా సరే ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వార్డు మొత్తం తారురోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టింది. మొత్తం రూ. 6.64 కోట్ల నిధులతో 67 పనులు చేపట్టింది. వీటిలో రూ. 5.20 కోట్లతో చేపట్టిన 60 పనులు పూర్తి కాగా, రూ.80 లక్షలతో తలపెట్టిన 5 పనులు కొనసాగుతున్నాయి. మరో రూ.64 లక్షల వ్యయంగల రెండు పనుల కోసం టెండర్లను ఆహ్వానించారు. వార్డులోని ప్రధాన రహదారుల నిర్మాణానికి ఏకంగా రూ. 2 కోట్లు ఖర్చు చేసింది. వీఐపీ రోడ్డు కోసం రూ.52 లక్షలు, పిఠాపురం కాలనీ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.48 లక్షలు ఖర్చు చేశారు. ఆంధ్రా బ్యాంకు బీటీ రోడ్డు, ఎస్పీ బంగ్లా రోడ్డు, బలరాంనగర్ బీటీ రోడ్డు, శ్రీకృష్ణ విద్యా నిలయం బీటీ రోడ్డు, మంగాపురం బీటీ రోడ్డు నిర్మాణాలకు రూ.కోటి వెచ్చించారు.


మంగాపురం కాలనీ సీసీ రోడ్డు నిర్మాణం





తారా మసీదు బీటీ రోడ్డు

రూ.64 లక్షల పనులకు టెండర్ల ఆహ్వానం

ముస్లింల కోసం షాదీఖానా, సామాజిక భవనం నిర్మాణాలకు జీవీఎంసీ రూ.64లక్షల నిధులు కేటాయించారు. వీటి నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించారు. త్వరలో ఈ పనులు ప్రారంభించి ఈ ఏడాదిలో పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించారు.

గతంలో ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు..



మా కాలనీలో రోడ్డు పాడై చాలా ఏళ్లు అవుతోంది. బైక్ నడపాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఇదే విషయం గతంలో అనేక సార్లు అధికారులకు, స్థానిక నాయకులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్పొరేషన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వార్డులో రోడ్లను అభివృద్ధి చేసింది.

– శ్రీను, పిఠాపురం కాలనీ

మురుగుతో నానా అవస్థలు పడ్డాం..



మా ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో కాలువల్లో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయేది. దీంతో దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు వచ్చేవి. ఇప్పుడు డ్రైనేజీ ఆధునికీకరణతో పాటు కాలువలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.

– ఎస్.కృష్ణ, రాజీవ్‌నగర్

నేడు పోలమాంబ అమ్మవారి పరస


పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: స్థానిక పోలమాంబ అమ్మవారి వార్షిక పరస గురువారం జరగనుంది. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో నేల వేషాలు, సాము గరిడీలు, చెక్క భజనలు, కోలాటం నడుమ పరస కోలాహలంగా సాగనుంది. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేస్తారు. భక్తులు రూ.216 చెల్లించి ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చు. పరస మహోత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం ఆలయం వెలుపల వివిధ వస్తువుల దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతారు. పెద్ద సంఖ్యలో సమీప గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకుని, పరస మహోత్సవాన్ని తిలకిస్తారని, ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ అధికారులు, సిబ్బంది పూర్తి చేశారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై హర్షం

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మధురవాడ జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చే 2 నెలల్లో రూ. 2.50 కోట్ల వ్యయంతో 50 అడుగుల పొడుగు, 10 అడుగుల వెడల్పు, 22 అడుగుల ఎత్తుతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం బాలల విజయమన్నారు. వంతెన ఆవశ్యకతపై జాతీయ రహదారుల సంస్థ అధికారులతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జీవీఎంసీ అధికారులకు తమ కమిషన్ తరఫున లేఖలు రాశామన్నారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించడం హర్షణీయమన్నారు.

క్లుప్తంగా

పేదల ఆశాజ్యోతి జ్యోతిబసు


జ్యోతిబసు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం మొదటి తరం నాయకుల్లో ఒకరైన దివంగత జ్యోతిబసు పేదల ఆశాజ్యోతి అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యుడు, 78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్.బి.గంగారావు కొనియాడారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జ్యోతిబసు 14వ వర్ధంతి సభ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జ్యోతిబసు చిత్ర పటానికి పార్టీ సీనియర్ నాయకులు జి.వి.ఎన్.చలపతి, సిహెచ్.ఎల్.ఎన్.శాస్త్రి, ఎ.వి.పద్మావతి, గంగారావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గంగారావు మాట్లాడుతూ భారత్‌లో దోపిడీ వ్యవస్థను కూల్చి సోషలిస్టు వ్యవస్థ రావాలన్న సిద్ధాంతాన్ని నమ్మిన గొప్ప విప్లవకారుడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పీతల అప్పారావు, వి.తులసీరాం, దండు నాగేశ్వరరావు, ఎం.ప్రదీప్, జి.వి. రమణ, రమాప్రభ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన కాలీఫ్లవర్ ధర


రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్స్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్ ధర తగ్గింది. కొద్ది రోజులుగా కిలో రూ.34కు విక్రయిస్తున్నారు. బుధవారం ఒక్కసారిగా రూ.22కు ధర తగ్గడంతో వినియోగదారులు, హోటల్, తోపుడుబళ్ల వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కాలీఫ్లవర్ రాజమహేంద్రవరం నుంచి వచ్చేది. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలోని ఆర్లీ, సంతపాలెం రైతులు పండించి బజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మరి కొదిరోజుల్లో కిలో ధర రూ.10కు దిగివచ్చే అవకాశం ఉంది.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేల కళేబరం


తిమ్మాపురం తీరంలో తాబేలు కళేబరం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం తీరం వద్దకు బుధవారం తాబేలు కళేబరం కొట్టుకుని వచ్చింది. ఇక్కడ మత్స్యకారులు దీనిని గమనించి వెళ్లి చూసేప్పటికి మృత్యువాత పడ్డట్లు తెలిపారు. సముద్రంలో పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మత్స్య జీవరాశులు మృత్యువాత పడుతున్నట్లు చెప్పారు. ఇటీవల మంగమారిపేట బీచ్ వద్ద భారీ డాల్ఫిన్, తాబేలు కళేబరాలు, ఉప్పాడ వద్ద భారీ తాబేలు కళేబరం కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. వరుస సంఘటనలతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో రమాబాయి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామగోత్రాలతో అమ్మవారిని పూజించారు. సాయంత్రం కూడా ఎరుకుమాంబ అమ్మవారిని పసుపు, కుంకమలతో అభిషేకించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కొనసాగిన సాంస్కృతిక ప్రదర్శనలు


చిన్నారుల నృత్య ప్రదర్శన


భాస్కరమ్మ బృందం సంగీత కచేరి

ఎంవీపీ కాలనీ: శ్రీకళా నృత్య నికేతన్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నిర్వహించిన క్లాసికల్ నృత్య నీరాజనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారం కూడా కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీతారాముల భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు శ్రీసీత రామలక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక హారతి, అర్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ కళా నృత్య నికేతన్ డాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. భాస్కరమ్మ బృందం శ్రీరామ కీర్తనలతో అలరించింది. గాయత్రి బృందంతో హనుమాన్ చాలీసా నిర్వహించారు. నాలుగు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను నిర్వాహకులు అందజేశారు.

కురుక్షేత్ర రహిత భారతం 'ఇట్లసుత' కావ్యం


ప్రసంగిస్తున్న రచయిత వరిగొండ కాంతారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహితీ సమావేశంలో రచయిత వరిగొండ కాంతారావు(వరంగల్) స్వీయ రచనా కావ్యం ఇట్లసుతపై ప్రసంగించారు. భారతంలో యుద్ధం వల్ల కలిగే ప్రాణ నష్టం శ్రీకృష్ణుడికి ఇష్టం లేదని, అందువల్ల కర్ణుడు కౌరవ పక్షం నుంచి పాండవ పక్షంలోకి వస్తే యుద్ధాన్ని నివారించే వీలుంటుందన్న ఆలోచనతో ఇట్లసుత కావ్యాన్ని రచించినట్లు తెలిపారు. ఇట్లసుత తెలంగాణ మాండలికంలో వెలసిన సంపూర్ణ ఇతిహాసమని, భారతంలో ప్రతి పాత్ర అంతర్మథనాన్ని, ఆలోచనలను చక్కగా చిత్రించినట్లు చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఇట్లసుత కావ్యం కురుక్షేత్ర రహిత భారతం రచనని, జన నష్టం జరగకుండా రచయిత నైపుణ్యంతో వైవిధ్య రచన చేశారన్నారు. అనంతరం రచయిత కాంతారావును సత్కరించారు. రచయితలు కె.జి. వేణు, డి.వి.సూర్యారావు, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరి రమణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

అగనంపూడి: తెలుగు జాతికి, భాషా ఔన్నత్యానికి గుర్తింపు తీసుకువచ్చిన శ్రీకృష్ణదేవరాయల కీర్తిని నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని రాష్ట్ర కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నవానిపాలెంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ముందు వరుసలో ఉంటారన్నారు. స్థానికంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన గ్రామాభివృద్ధి కమిటీని వారు అభినందించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి రోజున విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా నాయకురాలు గొన్నా రమాదేవి, అఖిలపక్షాల నాయకులు గవర సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, పాముల వసంతరావు, కరణం కళావతి, దాసరి వెంకట జయలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుమ్మల శ్రీను, ఇల్లపు శ్రీను, నరేంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక గురువు భారత్

అల్లిపురం : ప్రపంచ దేశాలకు భారత్ ఆధ్యాత్మిక నాయకత్వం వహిస్తుందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్థాపించిన బ్రహ్మ బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం సందర్భంగా వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మకుమారీ బోధనల ద్వారా విముక్తి కలుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశంలో యోగాకి విస్తృత ప్రాచుర్యం కల్పించారన్నారు. సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంకాలం బీచ్‌రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద అమరజ్యోతి బుర్ర కథా బృందం వారిచే పితాశ్రీ బ్రహ్మబాబా అద్భుత పావన జీవిత చరిత్ర విని, చూసి తరించాలని కోరారు. బ్రహ్మ పోస్టర్‌ను ముఖ్య అతిథి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సమాచారం ఎడిటర్ వీరభద్రరావు, సంస్థ ప్రతినిధులు రమా, బీకే శివలీల, శశికళ, సత్యవతి, బీకే వేణి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆర్.నారాయణమూర్తి సందడి


సినీనటుడు ఆర్.నారాయణమూర్తితో సెల్ఫీ తీసుకుంటున్న అభిమానులు

ఏయూ క్యాంపస్ : విప్లవ కథలతో తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకున్న నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి బుధవారం ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. సాయంత్రం ఆయన ఏయూ హాస్టళ్ల మీదుగా పరిపాలన భవనం నుంచి నడుచుకుంటూ వెళ్లారు. ఆయనను చూసిన నగరవాసులు కాసేపు ఫొటోలు తీసుకున్నారు. అడిగిన వారందరికీ ఆయన ఎంతో ఓర్పుగా ఫొటోలు కావాలా.. తీసుకోండి అంటూ ఆప్యాయంగా పలకరించారు.

'కళా ఉత్సవ్' విజేత రిషికకు సత్కారం


విద్యార్థిని రిషికను సత్కరిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: జాతీయ స్థాయిలో ప్రతి ఏడాది ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించే విభిన్న కళారంగాల పోటీల్లో తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని జి.రిషిక అద్భుతమైన కళా నైపుణ్యంతో మొదటి స్థానం సాధించింది. కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్, రీజనల్ డిప్యూటీ కమిషనర్, సహాయక కమిషనర్లు రిషికను, వాల్తేర్ కేవీ సంగీతాచార్యులు డాక్టర్ ద్వారం త్యాగరాజు, నాట్యాచారిణి సుంకర కృష్ణవేణిలను అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం కేంద్రీయ విద్యాలయంలో రిషికను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ పోటీల్లో రిషిక కూచిపూడి నృత్యంతో అందరినీ మెప్పించి ప్రథమ బహుమతి, బంగారు పతకాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ విజయం ద్వారా కేంద్రీయ విద్యాలయ సంఘటన్, వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ పేరుప్రతిష్టలు మరింత పెరిగాయన్నారు. రిషికను ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు, ప్రధానితో జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. సత్కార కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శైలజ, కేవీ సిబ్బంది ఎం.రేఖ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమీనా, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మా పాఠశాల అద్భుతం

తాము చదివిన పాఠశాల రూపురేఖలు మారి, కార్పొరేట్ లుక్ సంతరించుకోవడంతో లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి అద్భుతమని కొనియాడారు. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ.. సొంతూరు పండగకు వచ్చిన వారంతా పాఠశాలను చూసి ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో వారు పాఠశాల ప్రగతిపై ప్రశంసల జల్లు కురిపించారు.

- లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థుల హర్షం
- నాడు –నేడులో రూ.65 లక్షలతో పాఠశాల అభివృద్ధి
- దాతల సహకారంతో మరికొన్ని వసతులు


తాము చదువుకున్న పాఠశాల వద్ద లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు


సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న పూర్వ విద్యార్థులు

అగనంపూడి: లంకెలపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు గుర్రం శంకరరావు, సతీష్‌కుమార్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా పాఠశాలు రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు చదువుకోడానికి అనువైన వాతావరణం కల్పించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు వసతులను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ కృషి.. దాతల సహకారం

ప్రభుత్వ కృషి, చొరవ వల్లనే పాఠశాలకు అధునాతన వసతులు సమకూరాయని లంకెలపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.65 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అలాగే.. లారస్ ల్యాబ్స్ రూ.28 లక్షలతో క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దిందన్నారు. వసుధా ఫార్మా కంపెనీ మరో రూ.20లక్షలతో విద్యుత్ సౌకర్యం, ఆర్‌వో ప్లాంట్ చేయగా, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు సహకారంతో రూ.5లక్షలతో పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాల పూర్వ విద్యార్థులు గదులకు సేఫ్టీ గ్రిల్స్, ఫర్నిచర్, సరస్వతీ దేవి విగ్రహం, మైక్‌సెట్ వంటి సౌకర్యాలు కల్పించారన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు మరిన్ని వసతులు కల్పించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రౌతు అప్పాజీ, గాంధీ తదితరులు మాట్లాడారు.

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ'


ఆస్థాన మండపాన్ని శుభ్రం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే స్వామివారి పూజా సామగ్రిని శుభ్రం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి ఈ ప్రత్యేక పూజలో పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన పోదులాపు రాజు

సీతమ్మధార: మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో నివసిస్తున్న పోదులాపు రాజు(40) స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పక్కనే ఉన్న ఇంటికి వెళ్లి మహిళతో మాట్లాడాడు. చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి ఆమెతో ఎందుకు మాట్లాడుతున్నావంటూ రాజును మందలించారు. దీంతో అతడు మనస్తాపం చెంది ఇంట్లోనే ఉండిపోయాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఉన్న కుమారుడిని పనిమీద బయటకు పంపించాడు. ఎవరూ లేని ఆ సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అతడి భార్య కృష్ణవేణి ఇంటికి వచ్చి తలుపు కొట్టినప్పటికీ తెరవకపోవడంతో చుట్టుపక్కల ఉన్న వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోర్త్‌టౌన్ కానిస్టేబుల్ వచ్చి తలుపులు పగలగొట్టారు. రాజు విగతజీవిగా కనిపించడంతో భార్య కృష్ణవేణి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.